## క్లుప్తంగా

### ఉచితంగా తైక్వాండో శిక్షణ



తైక్వాండో శిక్షణ పొందుతున్న యువత

కురుపాం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక వైరిచర్ల డిగ్రీ కళాశాల మైదానంలో ఉచితంగా అందిస్తున్న తైక్వాండో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తిరుపతి రావు కోరారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు మళ్లీ సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 9490498247ను సంప్రదించాలన్నారు.

### ఆదర్శవంతమైన జీవనం సాగించాలి



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీరాములునాయుడు

పాలకొండ రూరల్: ప్రతిఒక్కరూ ఆదర్శవంతమైన జీవనం సాగించాలని ఉపాధ్యాయుడు జి.శ్రీరాములునాయుడు అన్నారు. స్థానిక సత్యసాయి మందిరంలో సోమవారం నిర్వహించిన వేసవి వెన్నెల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. పుస్తకాలు, ప్రముఖల జీవిత చరిత్రలు చదివి, మంచి మంచి విషయాలు తెలుసుకోవాలన్నారు. సద్గుణాలతో సన్మార్గంలో నడిచి, అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఆర్.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

గరుగుబిల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ)పై మంగళవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి సోమవారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 519 పనులకు సంబంధించి, దాదాపు రూ.13.69 కోట్లు ఖర్చు అయిందన్నారు. దీనిపై ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఆడిట్‌పై చర్చించడం కూడా జరిగిందన్నారు. ప్రజావేదికలో సంబంధిత అధికారులు పనుల వివరాలు, వాటికి అయ్యే ఖర్చు వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు.

### ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని అంపిలి గ్రామ సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆ గ్రామ పాఠశాలలో సోమవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇతర ఉన్నత చదువుల్లో కూడా ఇదే స్ఫూర్తితో బాగా చదువుకుని, ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చింత సంఘంనాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించండి



కోటకొండ గిరిశిఖర గ్రామంలో వెలసిన దుర్గమ్మ ప్రతిమలు

కురుపాం: మండలంలోని జి.శివడ పంచాయతీ, కోటకొండలో చేపడుతున్న దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని సర్పంచ్ మిన్నారావు కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఈ ప్రాంతంలో కొన్నాళ్ల క్రితం అతిపురాతనమైన దుర్గమ్మ విగ్రహాలు లభ్యమయ్యాయని, ఏటా దసరాకు చినమేరంగి రాజులైన శత్రుచర్ల వంశీయులు తొలిపూజ చేసేవారన్నారు. శ్రీకాకుళం–పార్వతీపురం మన్యం జిల్లాల కొండల మధ్య వెలసిన ఇక్కడి దుర్గమ్మను కోటదుర్గమ్మగా భక్తులు పిలుస్తారన్నారు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న అమ్మవారికి గుడి కట్టి రుణం తీసుకోవాలనుకుంటున్నామని, దాతలు కూడా ముందుకు వచ్చి, సహాయం చేయాలన్నారు.

# సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

- అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవు
- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



వినతులు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తోందని, ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి కోరారు. సోమవారం స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన ఆమె పలువురు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. గిరిజనుల నుంచి మొత్తం 52 వినతులు రాగా, లగేజి ఆటో మంజూరు చేయాలని కంతమానుగూడకు చెందిన సవర సురేష్, కంప్యూటర్ కాటా మంజూరు కోసం కొండచొర్లంగికి చెందిన అప్పలమ్మ, పెయింటింగ్ సామగ్రి కొనుగోళ్లకు ఆర్థికసాయం చేయాలని ఆంపురానికి చెందిన తేజేశ్వరరావు, హౌసింగ్ బిల్లులు చేయాలని మెట్టుగూడ గిరిజనులు, గోపాలపురానికి చెందిన భారతి, ఆయిల్ ఇంజిన్‌తో పాటు సాగునీటి పైపులు కావాలని బిల్లగూడకు చెందిన అప్పన్న, వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేయాలని సవర ముకుందాపురానికి చెందిన భాస్కరరావు వినతులు సమర్పించిన వారిలో ఉన్నారు. అంతకుముందు స్పందన కార్యక్రమానికి హాజరు కాని అధికారుల తీరుపై పీఓ మండిపడ్డారు. వారిపై చర్యలకు కలెక్టర్, ఆయా విభాగాల అధికారులకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ మురళి, డీడీ నగేష్, ఓఎస్డీ యుగంధర్, ఏఎంఓ కోటిబాబు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయండి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



వైద్యారోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు సూచించారు. హెల్త్ క్లీనిక్‌ల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉందని జిల్లా వైద్యశాఖాధికారి బి జగన్నాధరావు తెలిపారు. స్థానిక పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన ఆయన అక్కడ అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు, రోజువారీ ఓపీ వివరాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న సదుద్దేశ్యంతోనే గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు, పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు, నాలుగైదు పంచాయతీలకు పీహెచ్‌సీలు ఉండేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణుల వద్దకే అన్ని రకాల వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, చిత్తశుద్ధి, నిబద్ధతతో పని చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. మందుల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. రోగుల సమస్యలు విని, ఆరోగ్య సలహాలు, సూచనలు చేయాలన్నారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా 24 గంటల పాటు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# ధూమపానానికి దూరంగా ఉండాలి



ర్యాలీలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్

వీరఘట్టం: ధూమపానానికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదట మన నివాస ప్రాంతాలను పొగాకు రహిత ప్రాంతాలుగా మార్చుకోవాలన్నారు. ఆ తర్వాత పొగాకు రహిత గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం దిశగా అడుగులు వేయాలన్నారు. పొగాకు తాగడం కానీ, నమలడం కానీ చేయకూడదని, అలా చేస్తే కేన్సర్ బారినపడొచ్చన్నారు. అందమైన జీవితాన్ని పొగాకుతో నాశనం చేసుకుని, కుటుంబానికి విషాదం మిగల్చవద్దని కోరారు.

# పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించండి



పాలకొండ రూరల్: వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

- డ్వామా పీడీ కె.రామచంద్రరావు



కొమరాడ: చెరువు పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

కొమరాడ: ఉపాధి హామీ పనుల ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు, టెంట్లు ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలంలోని కోనవలస గ్రామంలో జరుగుతున్న చెరువు పనులను సోమవారం పరిశీలించిన ఆయన జిల్లాలో మొత్తం 150 చెరువుల వద్ద అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వేసవి ఎండల నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలోనే పని చేయాలన్నారు. నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బాలకృష్ణ, జేఈ స్వామీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా వేతనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు సూచించారు. మండలంలోని లుంబూరు గ్రామ సమీపంలోని గుడివాడ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పని చేస్తున్న వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

### 19న పైనాపిల్ రైతులతో సమావేశం

సీతంపేట: మండల కేంద్రంలో ఈ నెల 19వ తేదీన పైనాపిల్ రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మార్కెట్‌లో ఉత్పత్తుల విక్రయానికి సంబంధించి, అనుమతులపై చర్చించనున్నామని, ఉద్యానశాఖ అధికారులు, రైతులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

### పాఠశాలలోకి వెళ్తే పోలీస్ కేసు



దశుమంతపురం పాఠశాల గేటుకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

వీరఘట్టం: అనుమతి లేకుండా పాఠశాలలోకి వెళ్తే పోలీస్ కేసులు నమోదు చేస్తామని మండలంలోని దశుమంతపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.గంగారావు హెచ్చరించారు. ఇదే విషయం తెలిపే బోర్డును పాఠశాల గేటుకు సోమవారం ఏర్పాటు చేశారు. సరిగ్గా మూడు రోజుల క్రితం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తాళాలు పగలగొట్టి, అందులోని ఫర్నిచర్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని, ఈ మేరకు మరెప్పుడు అటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై, పాఠశాల భద్రతకు సహకరించాలని కోరారు.

### కప్పేసిన పొగమంచు



పాలకొండ-శ్రీకాకుళం రోడ్డులో కురుస్తున్న పొగమంచు

పాలకొండ: పట్టణాన్ని పొగమంచు కప్పేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు కురిసిన విపరీతమైన మంచు దారి కనిపించకుండా చేసింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని మరీ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం ఈ రకమైన వాతావరణం మధ్యాహ్నం భానుడి ప్రతాపానికి నెలకొంటున్న ఉక్కపోత వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంకెన్నాళ్లు ఇలాంటి వాతావరణం ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.


### స్పందన వినతులు పెండింగ్ ఉండరాదు

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పెండింగ్‌లో ఉండకుండా సత్వరమే నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ప్రజల నుంచి 84 అర్జీలను స్వీకరించారు. ఉపాధిహామీ పథకంలో పని అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, జిల్లా పౌరసరఫరాల కారి కేవీఎస్.మూర్తి, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ పి.వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి**

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి టెలిఫోన్ స్పందన కార్యక్రమాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో స్పందన కార్యక్రమంలో తమ సమస్యలను తెలుపుతారని, వాటి పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. టెలిఫోన్ స్పందన కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చాయని వాటిని పరిష్కరించి నివేదికను ఎస్పీ కార్యాలయానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.


# వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ సుకన్య



భామిని: దేశ నాయకుల జీవిత చరిత్ర వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు



పాలకొండ రూరల్: సమ్మర్ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులు

సమ్మర్ క్యాంప్‌లో భాగంగా పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు కోరారు. వేసవి సెలవుల కారణంగా పాఠశాలలకు దూరంగా ఉంటున్న విద్యార్థులకు చదువుపై ఏమాత్రం ఆసక్తి తగ్గకుండా ఉండేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. రోజుకో వినూత్న కార్యక్రమంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నారు. వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక పఠనంపై శిక్షణ ఇస్తున్నారు. పలు క్రీడాపోటీల్లో నైపుణ్యం కనబరిచేలా తీర్చిదిద్దుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను ఈ శిబిరాలకు పంపించేందుకు ఆసక్తి కనబరుస్తుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

సీతంపేట: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని డీఎల్‌డీఓ గోపాలకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన సమస్యల పరిష్కారానికి సచివాలయం గడప తొక్కే వారిని సాదరంగా ఆహ్వానించి, వారి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజాసమస్యలపై అర్జీలు సేకరించాలన్నారు. అనంతరం ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. గడువులోగా ఆయా పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండపల్లి సత్యం, గ్రామ కార్యదర్శి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



రైతు ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఆ దిశగా రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు కృషి చేయాలని డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ ప్రతినిధులు సురేంద్ర, కిశోర్ తెలిపారు. సోమవారం మండలంలోని తోటపల్లిలో ఉన్న ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో మా భూమి–విత్తన కంపెనీ ఉత్పత్తిదారులతో సమావేశమైన వారు రైతులు పండించిన ఉత్పత్తులను అధిక ధరకు మార్కెటింగ్ చేయడంపై పలు సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు ప్రజాదరణ ఉంటుందని, ప్రతిఒక్కరూ ఆ విధానంలో సాగుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తిపై కూడా రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ మేనేజర్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ లక్ష్మి

కొమరాడ: ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి సూచించారు. మండలంలోని గంగారేగువలస గ్రామ రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జ్ జి.అన్నపూర్ణ, ఆయా నేతలు మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందన్నారు. 30 రకాల విత్తనాలను సరఫరా చేస్తున్నామని, తొలకరి జల్లులకు ముందు వీటిని పొలాల్లో చల్లుకోవాలని తెలిపారు. 45 రోజుల తర్వాత వీటిని కలియదున్నడం ద్వారా ప్రధాన పంటకు కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయన్నారు. దీంతో ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు కూడా వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులను వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వెంకటరమణ, డి.జనార్దనరావు, ఎస్.మదుసూదనరావు పాల్గొన్నారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి, వారి చదువుపై ఆరాతీస్తున్న ప్రధానోపాధ్యాయుడు ముత్యాలు

జియ్యమ్మవలస: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చినమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ముత్యాలు కోరారు. వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినమేరంగి, లింగాలవలస ప్రాంతాల్లో సోమవారం సిబ్బందితో కలిసి పర్యటించిన ఆయన వేసవి సెలవుల్లోనూ పిల్లల కాసేపైనా చదువుతున్నారా లేదా అని ఇంటింటికీ వెళ్లి, ఆరాతీశారు. అలాగే ప్రభుత్వ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దుతోందని, నాణ్యమైన విద్య, విద్యాసామగ్రి ఉచితంగా అందజేస్తోందని వివరించారు. ఎవరైనా ప్రభుత్వ పాఠశాలల్లో చేరని వారుంటే అలాంటి వారు చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి జగన్‌మోహన్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

గరుగుబిల్లి: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అరుణకుమారి సూచించారు. మండలంలోని గిజబ గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొగతాగడం, మద్యం సేవించడంతో పాటు ఖైనీ, గుట్కా, గంజాయి వంటి వాటిని కూడా యువత ఎక్కువగా తీసుకుని, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఆయా అలవాట్లకు బానిసకాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతిరోజూ పౌష్టికాహారం ఉండే పదార్థాలు తీసుకోవాలని తెలిపారు.

# డీఈఓ పరిశీలన



జగనన్న విద్యాకానుక కిట్లు పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

కొమరాడ: మండల విద్యాశాఖ కార్యాలయంలోని జగనన్న విద్యాకానుక కిట్లను డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని, నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, విద్యాసామగ్రి ఉచితంగా అందజేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం వాటిని ఎప్పుడు పంపిణీ చేస్తారన్న విషయం ఎంఈఓ ఎంఈఓ జె.నారాయణస్వామిని అడిగి తెలుసుకున్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

భామిని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.